క్లుప్తంగా

నేడు సబ్ స్టేషన్ ఏర్పాటుకు భూమిపూజ



సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ అహ్మద్, స్థానిక నాయకులు

కుల్కచర్ల: తిర్మలాపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేయనున్న 11/32కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నారని ట్రాన్స్‌కో ఏఈ అహ్మద్ తెలిపారు. కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో చేపట్టే సబ్‌స్టేషన్ పనులకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెంటమీది వెంకటయ్య, శివయ్య, ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

బంట్వారం: నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి ఆపరేషన్ల కోసం బాధితులను నగరానికి తీసుకెళ్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి వాజుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 34మందికి కంటి సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో 11మంది శుక్లాల వ్యాధితో బాధపడుతున్నట్లుగా గుర్తించారు. కాగ మిగతా వారిలో బీపీ, షుగర్ తదితర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా 11మందికి కంటి ఆపరేషన్‌కోసం నగరంలోని శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, కంటి వైద్యులు జవహర్, శంకర ఆసుపత్రి సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

యాలాల: మండలంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గురువారం పర్యటించనున్నారని సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు బెన్నూరు గ్రామంలో కమ్యూనిటీ భవన శంకుస్థాపన చేస్తారని, అనంతరం సంగెంకుర్దు, రాఘవపూర్, కమాల్‌పూర్ గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామసభల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు గ్రామ సభలు

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 9, 10, 11, 12 వార్డుల్లో గురువారం ఉదయం 10 గంటలకు ప్రజా పాలన సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తెలిపారు. 9వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రంలో, 10వ వార్డులో చౌడేశ్వరి మాత ఆలయ ఆవరణలో, 11వ వార్డులో నగరేశ్వర స్వామి ఆలయ ఆవరణలో, 12 వార్డులో ఎస్సీ కమ్యూనిటీ హాల్లో ఈ సభలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో కూడా గ్రామ సభలు కొనసాగుతాయని ఎంపీడీఓ ఉషశ్రీ తెలిపారు. ఆలేడు, అంగడి రాయిచూర్, కస్తూరుపల్లి, ఖాజా అహ్మద్‌పల్లి, పర్సాపూర్, ప్యాలమద్ది, రావులపల్లి, రుద్రారం గ్రామాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం

బొంరాస్‌పేట: బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యమని మండల నాయకులు పేర్కొన్నారు. బుధవారం బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మెట్లకుంటకు చెందిన రవిగౌడ్ పుట్టినరోజు వేడుకలను మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, శేరినారాయణరెడ్డి, యాదగిరి, సుదర్శన్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌పాషా, మధుయాదవ్, నరేశ్‌గౌడ్, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సరుకులు పక్కదారి!

- అధికారుల పర్యవేక్షణలేకే చేతివాటం
- చర్యలు తీసుకోవాలని విన్నవం



అంగన్‌వాడీ టీచర్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

దోమ: అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడ పనిచేసే సిబ్బంది సరుకులను పక్కదారి పట్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బుధవారం దోమ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఓ వ్యక్తి సెంటర్ నుంచి సరుకులను ఎత్తుకెళ్తుండగా అతనిని గ్రామస్తులు పట్టుకుని నిలదీశారు. వాటిని పశువులకు వేసేందుకు తీసుకెళ్తునట్లు చెప్పాడని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం గురించి అంగన్‌వాడీ సెంటర్‌లో పనిచేస్తున్న టీచర్‌ను నిలదీయగా పొంతన లేని సమాధానం చెప్పింది.

అధికారుల పర్యవేక్షణ కరువు

ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలను సమీక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అక్కడి సరుకులు పక్కదారి పడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంలో కొందరు టీచర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తుంటే కొందరు టీచర్లు ఇలా సరుకులను పక్కదారి పట్టించడం బాధాకరమని చెబుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసే బాలామృతం ప్యాకెట్లను కొందరు వ్యక్తులు అంగన్‌వాడీ టీచర్లతో ఒప్పందం కుదుర్చుకొని వాటిని తీసుకెళ్లి పశువుల మేతగా ఉపయోగించుకుంటున్నారని చెబుతున్నారు. దీంతో బాలింతలకు, చిన్నారులకు, గర్భిణులకు అందాల్సిన పౌష్టికాహారం అందకుండా పశువులకు వేయడం ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు వెంటనే ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఓ వ్యక్తి వ్యవసాయ క్షేత్రంలో నిల్వచేసిన బాలామృతం ప్యాకెట్

శ్రీరామ నామంతో మోక్షం



తాండూరు టౌన్: అయోధ్య రామాలయ వార్షికోత్సవ పూజలో మహిళలు



పరిగి: రాఘవపూర్ ఊరేగింపులో భజన చేస్తున్న భక్తులు



బొంరాస్‌పేట: ర్యాలీ ప్రారంభిస్తున్న హిందూవాహిని నాయకులు

తాండూరు టౌన్: గాంధీనగర్‌లోని శ్రీ కట్టమైసమ్మ ఆలయంలో కౌన్సిలర్ సంగీతా ఠాకూర్, వార్డు ప్రజలు అయోధ్య రామాలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. శ్రీరామచంద్రుని చిత్రపటానికి పూజలు నిర్వహించిన అనంతరం భజన కీర్తనలతో రామనామ స్మరణ చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను నిర్వహించినట్లు కౌన్సిలర్ సంగీత తెలిపారు. శ్రీరాముని కరుణాకటాక్షం ప్రజలందరిపై ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆమె తెలిపారు.

పరిగి: శ్రీరామ నామంతో మోక్షం కలుగుతుందని పలువురు భక్తులు పేర్కొన్నారు. అయోధ్య రామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ నిర్వహించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలరాముని ప్రాణప్రతిష్ఠ జరిగిన నాటి నుంచి గ్రామంలోని హనుమాన్‌దేవాలయంలో ఏక నామాన్ని స్మరిస్తూ భజన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు సత్యనారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటయ్య, కేశవులు, రవికుమార్, అంజయ్య పాల్గొన్నారు.

హిందూవాహిని బైక్‌ర్యాలీ

బొంరాస్‌పేట: అయోధ్య రామ మందిరం పూర్తయి ఏడాది గడిచిన సందర్భంగా హిందూ వాహిని నాయకులు బుధవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం శివారులోని సంగాయిపల్లి గడ్డ నుంచి హనుమాన్ దేవాలయం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజు, రమేశ్, శ్రీను, జగదీశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను స్కూల్లో చేర్పించాలి



కుల్కచర్ల: విద్యార్థి కుటుంబీకులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



బొంరాస్‌పేట: ఇటుక బట్టీల్లో బాలలతో సీఆర్‌పీ, ఈఆర్‌పీలు

కుల్కచర్ల: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జెడ్పీ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిలయ్య, సీఆర్పీ గాంగ్యనాయక్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో అర్బాస్ అనే విద్యార్థి మూడు నెలల నుంచి పాఠశాలకు రావడం లేదు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అతన్ని మళ్లీ బడిలో చేర్పించాలని వారితో కోరారు. బడీడు పిల్లలను ఎవరు కూడా పనుల్లో పెట్టుకోవద్దన్నారు.

దుద్యాల్: చదువుకునే వయస్సులో పిల్లలు బడి బయట ఉండొద్దని దుద్యాల్ మండల సీఆర్‌పీ రాందాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ముచ్చుకుంట తండాలో మేనక, అమృత బడి మానేసి ఇంటి దగ్గర ఉంటున్నారనే విషయం తెలుసుకుని, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారిని పాఠశాలకు పంపించాలని అవగాహన కల్పించారు.

బొంరాస్‌పేట: బడీడు పిల్లలంతా చదువుకోవాలని, ఇటుక బట్టీల్లో పనిచేయొద్దన్నారు. బుధవారం మండలంలోని సీఆర్‌పీ సోమ్లానాయక్, ఐఈఆర్‌పీ వేణుగోపాల్ బడిబయటి పిల్లల సర్వే చేశారు. సర్వేలో భాగంగా భోజన్నగడ్డతండా సమీపంలోని ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న బాలలను గుర్తించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. వెంటనే వారిని బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు.

గడువులోగా పత్రాలు అందజేయాలి

బంట్వారం: రైతు భరోసా పథకం కోసం 2024 డిసెంబర్ 31 వరకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం ఎవరికైనా వచ్చి ఉంటే ఈ నెల 26లోపు అందజేయాలని వ్యవసాయ శాఖ ఏఓ శ్రావ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రైతుబంధు పథకం కింద దరఖాస్తు పెట్టుకోని రైతులు కూడా సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డ్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలను జత చేసి వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

హక్కుల సాధనకు కృషి



ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు

కుల్కచర్ల: ఎస్సీ హక్కుల సాధనకు ఎమ్మార్పీఎస్ పనిచేయాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళితులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మండల అధ్యక్షుడిగా మొగులయ్య, గౌరవ అధ్యక్షుడిగా చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా తిరుపతయ్య, ఉపాధ్యక్షుడిగా బాలరాజు, సంయుక్త కార్యదర్శిగా లింగం, కార్యదర్శిగా ఆంజనేయులు తదితరులను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

ఎస్ఐ రవిగౌడ్



దౌల్తాబాద్: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

దౌల్తాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు కృషి చేయాలని ఎస్ఐ రవిగౌడ్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో వాహనదారులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని అలా చేస్తే మోటారు వాహనాల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ నిఖిల్, హెడ్‌కానిస్టేబుల్ దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ జీవి సత్యనారాయణ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు వాహనాల డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు ఇచ్చారు. వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు.

టై, బెల్టు, ఐడెంటికార్డుల అందజేత



టై, బెల్టు, ఐడెంటికార్డులను అందిస్తున్న నాయకులు, గ్రామస్తులు

కుల్కచర్ల: ఇప్పాయిపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు టై, బెల్టు, ఐడెంటికార్డులు అందజేశారు. బుధవారం మాజీ ఎంపీటీసీ పద్మరఘు గౌడ్ కుమారుడి పుట్టినరోజును పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులందరికీ బెల్టులు, వాడల బాలచంద్రయ్య టై, షాబాద్ బాలకృష్ణయ్య ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అనురాధ, మాజీ ఎంపీటీసీ పద్మ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సుధారాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగయ్య, ఏ.రాములు గౌడ్, ఆనంద్, భీమయ్య, శంకర్, భాగ్యమ్మ, నరేశ్, ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, సరిత, రుక్మిణి, శివశంకర్, శ్యాంసుందర్, యాదయ్య, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుకు నివాళి

తాండూరు రూరల్: ఎల్మకన్నె మాజీ సర్పంచు మహిపాల్‌రెడ్డి దశదినకర్మ సందర్భంగా బుధవారం కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీకోసం పనిచేసే వారిని ఆపదలో ఆదుకుంటామన్నారు. ఆయన వెంట గౌతపూర్ రాంచెంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల బహూకరణ

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉన్న సీతారామాంజనేయస్వామి దేవాలయానికి బుధవారం గ్రామానికి చెందిన స్వర్గీయ చాపల బాలకృష్ణయ్య, వెంకటమ్మ జ్ఞాపకార్థం వారి కూతురు అలివేలు మంగ, అల్లుడు కృష్ణ రూ.80వేల విలువ చేసే దేవతామూర్తుల కంచు విగ్రహాలను బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరీంపూర్ గ్రామ సభలో గందరగోళం



బంట్వారం: కరీంపూర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై నిలదీత

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని కరీంపూర్‌లో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో గందరగోళం నెలకొంది. అధికారులు ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను సభలో చదివి వినిపిస్తుండగా పలువురు గ్రామస్తులు నిలదీశారు. అర్హులకు కాకుండా అనర్హులను ఎంపిక చేయడమేంటని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ డానియల్ నచ్చజెప్పి సముదాయించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం వారు అర్హుల దరఖాస్తులు స్వీకరించారు.

మురుగు.. పరుగు!

- రోడ్డుపై పారుతున్న వ్యర్థ జలం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న తండా వాసులు
- పట్టించుకోని అధికారులు



తండాలో రోడ్డుపై చేరిన మురుగు

మోమిన్‌పేట: మండల పరిధిలోని పల్లేగుట్ట తండాలో బీటీ రోడ్డుపై మురుగు పరుగుతీస్తుంది. దీంతో అక్కడ దోమలు, ఈగలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నట్లు తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మురుగు నీరు చేరడంతో ఈ తండా మీదుగా సయ్యద్ అల్లిపూర్ గ్రామానికి వెళ్లే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ రోడ్డు గుండా ద్విచక్రవాహన దారులు వెళ్తే జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వారు చెబుతున్నారు. గతంలో ఈ రోడ్డుగుండా వెళ్తే కిందపడిన సంఘటనలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి దాపురించిందని తండా వాసులు చెబుతున్నారు. తక్షణమే ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గ్రహించి రోడ్డుపై చేరిన మురుగును శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొనసాగుతున్న గ్రామ సభలు



దౌల్తాబాద్: మాటూరు గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు గాయత్రి



ధారూరు: కుక్కింద గ్రామంలో లబ్ధిదారుల వివరాలు చదువుతున్న అధికారులు



కొడంగల్ రూరల్: ఉడిమేశ్వరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. పీరంపల్లిలో మండల వ్యవసాయాధికారి ప్రసన్నలక్ష్మి, పులుమద్దిలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, బురాన్‌పల్లిలో ఎంపీఓ దయానంద్, కామరెడ్డిగూడలో హార్టికల్చర్ అధికారి కమల, ద్యాచారంలో ఎంఈఓ బాబుసింగ్, రాళ్ల చిట్టంపల్లిలో ఆర్‌డబ్ల్యుఎస్ రవి అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. పులుమద్ది సభలో ఆర్టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో గ్రామసభలు నిర్వహిస్తోందని తహసీల్దార్ బి విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఉడిమేశ్వరం, నాగారం, ఇందనూర్, భవనమ్మతండా, లక్ష్మీపల్లి, చిట్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం

కొడంగల్: మండల పరిధిలో అర్హులైన పేదలందరికీ న్యాయం చేస్తామని తహసీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని భవనమ్మ తండా, ఇందనూర్, లక్ష్మీపల్లి, పాటిమీదిపల్లి, ఉడిమేశ్వరం, నాగారం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సాగులో ఉన్న భూములకు రైతు భరోసా ఇవ్వనున్నట్లు చెప్పారు. అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 4, 5, 6, 7 వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట: సంక్షేమ పథకాలను మంజూరు చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఏన్కతల, కొల్కుంద గ్రామ సభల్లో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. 10ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపిఓ యాదగిరి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, అర్ఐ గోవర్ధన్, కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అర్హులను గుర్తించి మంజూరు చేస్తారని కొడంగల్ వ్యవసాయశాఖ ఏడీఏ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. మండలంలోని నందారం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొని మాట్లాడారు.

యాలాల: ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యాలాల సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. అగ్గనూరులో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఇటీవల వెల్లడించిన జాబితాల్లో పేర్లు రాని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ధారూరు: ధారూరు మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామ సభల్లో రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు ప్రజలు దరఖాస్తులు అందజేశారు. మండలంలోని అంతారం, ధారూరు, స్టేషన్‌ధారూరు, ఎబ్బనూర్, గురుదోట్ల, కేరెల్లి, కొండాపూర్‌కలాన్, కుక్కింద, నాగారం, నాగసమందర్, రాజాపూర్, రాంపూర్‌తండా, రుద్రారంలో ఆయా పథకాలకు అర్హులు దరఖాస్తులు అందజేశారు.

బొంరాస్‌పేట: మండల పరిధిలోని కొత్తూరు తదితర గ్రామాల్లో గ్రామసభలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకాధికారులు ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్, ఏడీఏ శంకర్‌రాథోడ్, ఎంపీడీఓ వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

బంట్వారం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. మండల పరిధిలోని బస్వాపూర్, సల్బత్తాపూర్, నాగవరంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.